# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 03-06-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

**1. ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఈ నెల 5న కోటి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు.**

**2. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో పరిపాలనా భవనాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి తెలిపింది.**

**3. భూభారతి అమల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఈరోజు నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు.**

**4. సరైన పౌష్టికాహారంతో ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు.**

**5. తెలంగాణలో పదవ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈరోజు నుంచి ప్రారంభమవుతున్నాయి.**

==========================

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఈ నెల 5న కోటి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, కలెక్టర్లు పాల్గొనాలని ఆదేశించారు. బస్టాండు, రోడ్ల పక్కన, విద్యాసంస్థలు, ఆస్పత్రులు, ప్రభుత్వ కార్యాలయాల్లో సంరక్షణ కంచెలతో మొక్కలు నాటాలన్నారు. 2033 నాటికి రాష్ట్రంలో పచ్చదనం 37శాతానికి, 2047 నాటికి 50శాతం పెరగాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

ఇదిలా ఉండగా ప్రభుత్వ పాలనలో అంతరిక్ష సాంకేతికతను విస్తృతంగా ఉపయోగించుకోవడంతోపాటు వ్యవసాయ, వాతావరణ, విపత్తుల నిర్వహణ, పట్టణ ప్రణాళిక వంటి అంశాలకు ఒక ప్లాట్‌ఫాంను మరింత అభివృద్ధి చేసేందుకుభారత అంతరిక్ష పరిశోధన సంస్థ –ఇస్రో తో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో పరిపాలనా భవనాల నిర్మాణానికి సంబంధించి.. 3వేల 673 కోట్ల

రూపాయల పనులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనుమతులు మంజూరు చేశారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన నిన్న సీఆర్‌డీఏ అథారిటీ సమావేశం జరిగింది. సమావేశ నిర్ణయాలను పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ పాత్రికేయులకు వెల్లడించారు. భవనాల నిర్మాణానికి న్యాయపరమైన సమస్యలు లేకుండా టెండర్ల ప్రక్రియ పూర్తిచేశామని తెలిపారు. ఇప్పటి వరకు భూ సమీకరణ నిబంధనలు 217చదరపు కి.మీ వరకే ఉన్నాయని నిబంధనల పరిధిని పెంచేందుకు నిర్ణయం తీసుకున్నామని మంత్రి వివరిస్తూ,

వాయిస్ ..34 సెకన్లు

---------------------------

తెలంగాణలో భూ సమస్యల పరిష్కారానికి.. కృషి చేస్తున్నామని రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. జనగామ జిల్లా పాలకుర్తిలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ భూభారతి అమల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ అధికారులు ఈరోజు నుంచి గ్రామాలను సందర్శిస్తారని వెల్లడించారు. ఈ నెల 20 వరకు అధికారులే ప్రజల వద్దకు వచ్చి రెవెన్యూ సమస్యలు పరిష్కరిస్తారని మంత్రి తెలుపుతూ,

వాయిస్ ..31 సెకన్లు

---------------------------

సరైన పౌష్టికాహారాన్ని అందించడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సాలూరు మండలంలోని గిరిజన ప్రాంతాల గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పాలపొడి ప్యాకెట్లను మంత్రి నిన్న పంపిణీ చేశారు. అనంతరం ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ, పౌష్టికాహార లోపం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయని చెప్పారు. దీన్ని నివారించేందుకు పైలెట్ ప్రాజెక్టుగా జిల్లాలోని సాలూరు, పాచిపెంట ఆదివాసీ ప్రాంతాల్లో పాలపొడి ప్యాకెట్ల పంపిణీని ప్రారంభించడం జరిగిందని పేర్కొన్నారు.

---------------------------

పర్యాటకానికి ప్రాధాన్యతనిచ్చేలా మచిలీపట్నంలోని మంగినపూడి బీచ్ వద్ద మసులా ఫెస్ట్- 2025 నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. కృష్ణాజిల్లాలో మచిలీపట్నంలో బీచ్ ఫెస్టివల్ కు సంబంధించిన గోడ పత్రికను మంత్రి నిన్న ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్.. 31 సెకన్లు

---------------------------

తెలంగాణలో పదవ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈరోజు నుంచి ప్రారంభమవుతున్నాయి. ఈ నెల 13 వ తేదీ వరకు ఉదయం 9 గంటల 30 నిమిషాల నుంచి మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాల వరకు ఈ పరీక్షలు నిర్వహిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా హాజరుకానున్న 42 వేల 832 మంది విద్యార్థులు కోసం 150 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈరోజు ఫస్ట్ లాంగ్వేజ్ పరీక్ష జరుగుతుంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని తూర్పుగోదావరి జిల్లాలో జరిగిన రహదారి ప్రమాదంలో ఐదుగురు మృతి చెందారు. జిల్లాలోని రంగంపేట మండలం వడిశలేరు సమీపంలో ఆయిల్ ట్యాంకర్‌ను వెనకనుంచి కారు ఢీ కొట్టడంతో ప్రమాదం జరిగిందని అధికారులు తెలిపారు. కారు రాజమహేంద్రవరం నుంచి కాకినాడ వైపు వెళ్తుండగా ఈ ఘటన చోటు చేసుకుందని చెప్పారు. మృతులను రాజమహేంద్రవరం కవలగొయ్యికి చెందిన వారిగా గుర్తించామని తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మరోవైపు రహదారి ప్రమాద ఘటనపై పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఒక నిర్దిష్ట ప్రణాళిక తయారు చేయాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్ లో రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకునేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు

---------------------------

ఉగ్రవాదంపై భారత్ వైఖరిని తెలియజేస్తున్న అఖిలపక్ష ప్రతినిధి బృందాల విదేశాల పర్యటన కొనసాగుతోంది. ఇందులో భాగంగా ఇంగ్లండ్ లోని లండన్లో పర్యటిస్తున్నబిజెపి ఎంపీ రవిశంకర్ ప్రసాద్ నేతృత్వంలోని అఖిల పక్ష బృందం యూకె లేబర్ ఇండియా బృందాలతో సమావేశమైంది. ఉగ్రవాదాన్ని దృఢ సంకల్పంతో ఎదుర్కోవడానికి భారత్ నిబద్ధతను ప్రతినిధి బృందం ఈ సందర్భంగా పునరుద్ఘాటించింది. ఉగ్రవాదం ప్రపంచ స్థిరత్వాన్ని ప్రమాదంలో పడేస్తూనే ఉందని, శాశ్వత శాంతి, భద్రత, మానవాళి సమిష్టి శ్రేయస్సు కోసం ఉమ్మడిగా ఈ ముప్పును తొలగించడానికి బలమైన సహకారం అవసరమని తెలిపింది.

---------------------------

మిస్ వరల్డ్ విజేతలకు హైదరాబాద్ లోని రాజ్ భవన్‌లో తెలంగాణ గవర్నర్ బిష్ణు దేవ్ వర్మ తేనీటి విందు ఇచ్చారు. గత సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు పలువురు మంత్రులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు, డీజీపీ జితేందర్, పలువురు అధికారులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 72వ మిస్ వరల్డ్ విజేత థాయిలాండ్‌కు చెందిన ఓపల్ సుచాతా చుయాంగ్ శ్రీ తోపాటు ఆఫ్రికా కాంటినెంటల్ విజేత ఈథియోపియా హస్సెట్ దేరేజే, యూరప్ కాంటినెంటల్ మిస్ పోలాండ్ మజ క్లాజ్డా, అమెరికన్–కరీబియన్ కాంటినెంటల్ విజేత ఆరెల్ల జోఅచ్చిమ్‌లను ఈ సందర్భంగా సత్కరించారు.

=====================